# నుప్వ కడుపులు

**బా**గా రేత్తి రవుతుండది. ఆ యీదిలో సీకటి గాడాందకారం.

"మాదాకోళం అమ్మగోరూ!" ఆ నరిశాడు పోలాయి, వాములు అంటుకుంటే గొడ్డు అరిసినట్టు.

"యీడ బయింగుంటది. ఆతల యీదికి ఎల్దాం పదయ్యా" అంది పోలాయి పెల్లాం సుబ్బాం.

"ఏ యీదయితే ఏవేఁ బగవంతు డుండాలగానీ, పదా" అన్నాడు పోలాయి, సుబ్బాం బుజమ్మీన బరువుమోపుతా.

"ఈ యీదిలో ఎవురేం పెట్టరయ్యా, నువు యినవూ."

"నువు సందేల యాడో తినొచ్చావులేయే. మూలుగుతూ కూకుండ నాకేడ దొరుకుద్ది గానీ."

"అది గందుకే రగిలేది! మొదట్నుంచీ నీకేందో లోన కొట్టుకుంటనే వుంది. అట్ట తూల్తా వేందీ-!"

"నా కల్లు తిరుగుతుండై-కాత్తె పొట్టుకో - మాదాకోళం అమ్మగోరూ?" గొంతు గుడగుళ్ళాడింది పోలాయికి.

"ఇదేందయ్యా నువూ, యింటో కూకోమంటే-"

"మాట రాటంలా-కాత్తె అరూ; ఎవురేవన్నా పెద్తారూ-"

"నా సేతగాదయ్యా, నామాట ఎవురూ యిన్రూ."

"వుక్ వుక్-వుఁ-పొట్టుకో-"

"ఇదేంది బాబో" - "మాదాకోళం అమ్మగోరూ?"

"వుకుక్-అసె పెద్దగా అరూ-"

"అయ్యో- 'ఓ అమ్మగోరూ?"

"అమ్మగోరూ-" పోలాయి గొంతులో మేకు బిగుత్తుండది.

"అయ్యొ అట్ట జారిపోతాడేందమ్మో - అదేందీ - ఓమ్మో - 'అమ్మగోరూ'-"